కాళ్ళు, తనమె గుమ్మంముందు పెట్టి వెనక్కి తిరిగాడు. అప్పటికామె వరండాలోకి వచ్చింది. 'అదేంటవి! నావిళ్ళు నాకు ఇదుకు తీసుకున్నారా? ఇదుగో చూడండి ఈ బిందెలో నీళ్ళు నాకీ రోజుకు చాలు!' అంటూ చూపించింది. అతను కూజా తీసుకొని పైకి వచ్చేశాడు.

ఆమెలో సంస్కారం ఉంది. మర్యాద తెలిసిన మనిషిని బహుశా తప్పనిసరి పరిస్థితులవల్ల ఈ పట్నంలో ఏదో ఉద్యోగం చేస్తూ ఎక్కడోఉన్న తన వారికి సాయం పంపుతోంది!' అనుకొన్నాడు శ్రీహరి. ఆమెపట్ల అతనికి గౌరవంతోకూడిన అభిమానం ఆకర్షణ పెరిగాయి.

చూస్తుండగానే సాయంత్రమైంది.

మేడమీద ఖాళీజాగాలో పచార్లు చేస్తున్న శ్రీహరి పరిసరాలను పరిశీలించాడు. తనున్నది ఒక్కటే డాబా! మిగిలినవన్నీ చాలావరకు పెంకుటిళ్ళు. కొన్ని సిమెంటు రాళ్ళతోకట్టి పైన తాటాకు కప్పిన పాకలు. ఆ సిమెంటు రాళ్ళలోనే కొన్ని పావురాల గూళ్ళలాంటి కంతలలో కిటికీల్లా ఉండి [illegible] గాలినీ, వెలుగునూ లోనికి ప్రసారం చేస్తున్నాయి. రాళ్ళతో కట్టిన వీధికాలువ అక్కడక్కడా రాళ్ళు అదృశ్యమైపోవడంవల్ల మురికినీరు పారి రోడ్డుమీది పల్లపు ప్రాంతాల నావరించింది. ముఖం ముందువేగి చీకాకు పరిచే దోమలను నిరోధించే ప్రయత్నంలో అతను తన తలపైన రాశి పరిభ్రమించే మశక సమూహాన్ని చూశాడు. ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. తన దగ్గర దోమ తెరలేదు. 'బలవంతమైన సర్పము — చలి చీమలు' గుర్తొచ్చాయి.

సంధ్యాసమయం కావడంతో గదిలోకి వెళ్ళి కొవ్వొత్తి వెలిగించి వచ్చాడు. కొవ్వొత్తితో లాభంలేదు. మళ్ళీ బజారుకి వెళ్ళినప్పుడు కిరోసినులైటు తేవాలి. వీధి లైట్లన్నీ వెలిగించబోవడంతో అతని దృష్టి ఆ దిక్కుగా ప్రసరించింది. ఎక్కడా లైటు హోల్డరుకైనా బల్బులేదు. పగిలి రాలిపోగా మిగిలిన భాగం మాత్రం హోల్డరులో ఉన్నట్లనిపించింది. ఎవరో ప్రత్యేకమైన శ్రమ తీసుకొని రాళ్ళు విసరకపోతే అంత ఎత్తు మీదివి ఎలా చితుకుతాయి, అంద ఉపయోగపడే కాంతిని పని కట్టుకొని

# హాయి మనసులు

నిర్మూలించవలసిన అవసరం ఎవరికి వచ్చింది—?

లైట్లు లేకపోవడం మురికినీటి గుంటలతో ఉన్న కొత్తదారి కావడంవల్ల అతను కాస్త వెలుతురు ఉండగానే వెళ్ళి భోజనం చేసి వద్దామనుకున్నాడు. గదికి తాళం వేసి మెట్లు దిగాడు. ప్రసాద్ కూడ ఏడు గంటలకల్లా భోజనానికి వస్తానన్నాడు. శ్రీహరి ఆరు గంటలకే హోటల్ మెట్లెక్కడం జరిగింది. భోజనంచేసి విశ్రాంతి నిమిత్తం అమర్చిన కుర్చీలలో ఒకదానిని ఆక్రమించి సిగరెట్ వెలిగించాడు. పత్రిక తిరగేస్తూ ప్రసాద్‌కోసం ఎదురు చూడ సాగాడు. తనకొక గది అంటూ దొరికేన దాకా శ్రీహరి అతని గదిలోనే ఉన్నాడు, ఒక్క ప్రసాదే అయితే శ్రీహరి అతని గదిలోనే ఉండేవాడు. కాని తనరాక కన్నముందే అతను మరొక రూమ్మేటును కలుపుకొన్నాడు గది చాలా చిన్నది. ప్రసాద్ ముఖం చూస్తూ పైకి చెప్పలేకపోయినా శ్రీహరి ఉనికివల్ల రామారావు ఇబ్బంది ఫీలయ్యేవాడు.

'ఒకవైపు ఉద్యోగాన్వేషణ చేస్తూ అనవసపు ఖర్చులెందుకు పెంచుకుంటావు భాయ్? ఉద్యోగం దొరికేవరకూ ఇక్కడే ఉండు. యేలాగో సర్దుకుంటాం' అన్నాడు ప్రసాద్.

లేదులే! ముగ్గురికి యెంత ఇరుకుగా ఉందో చూస్తున్నావుగా, నన్ను వెళనీ అంతగా అయితే ఆదివారాలు సరిగ్గా ఉంటే నాకొక రూమ్మేటును చూడు. సగం భారం తగ్గుతుంది'

'సరే కానీ!' అనక తప్పలేదు ప్రసాద్‌కు. మిత్రులు చాలా తక్కువమంది అయిన శ్రీహరికి వేళ్ళమీద లెక్కించవలసిన సన్నిహితులలో ప్రసాద్ ఒకడు. చెప్పిన సమయంకన్న అరగంట ఆలస్యంగా వచ్చాడతను ఇద్దరు బయటపడే సమయానికి హోటల్ గడియారం తొమ్మిది గంటలు కొడుతూ ఉంది.

పాన్‌షాపు దగ్గర ఆగారు.

'పాన్ వేసుకుంటావా శ్రీహరీ.'

'ఊహూఁ'

'సిగరెట్?'

'తాకొబాకూడా పూర్తైంది. రాత్రి నిద్ర రావడం ఆలస్యమైతే తప్ప మరొక జ్ఞాపకశక్తి అనవసరం.'

ప్రసాద్‌నవ్వి తనకొక పాన్ చెప్పి సిగరెట్ వెలిగించాడు.

'రిక్షా హోనా క్యాసాబ్' దగ్గరవచ్చి అదో రకంగా మెల్లిగా అడిగాడు రిక్షావాలా.

'నక్కోమియా' అంటూ 'నీ రూం ఇక్కడికి ఎంత దూరం' అని అడిగాడు ప్రసాద్.

'సుమారు ఒకమైలుండొచ్చు.'

'మైలే! ఇక్కడికి నారూం అంతేగా! నేను నీదగ్గరకు రావాలన్నా నీవు నాదగ్గరకు రావాలన్నా రెండు మైళ్ళు నడవాలన్న మాట.'

అతను పాను వేసుకుంటూ 'బిల్ట్స్ వచ్చిందా' అని పాన్‌షాపతనిని అడిగాడు.

'లేదుసార్ రేపు వస్తుంది.'

ఇద్దరు వెనక్కు తిరిగారు.

'నేనొకటి ఆలోచించాను' అన్నాడు శ్రీహరి.

'ఏమిటి?'

'మనిద్దరం ఈ హోటల్ దగ్గర కలుసుకుంటే చెరొకమైలు నడక పొదుపు చేయవచ్చు.'

'ప్రసాద్ నవ్వి నీరూంకు నన్ను రావద్దంటావ్! అంతేనా' అన్నాడు.

'అదేం కాదు రూం ప్రోగ్రాం ఆదివారాల నాడు. ఒక ఆదివారం నీవు నా రూంకు వస్తే, మరుసటి వారం నేను నీ రూంకు వస్తాను. మధ్యాహ్నం భోజనం కాగానే ఎవరి డ్యూటీ ప్రకారం వారు తమ అతిథిని మర్యాదగా రిక్షా మీద తీసుకెళ్ళాలి. ఎలా ఉంది నా ఉపాయం?'

'అమోఘంగా ఉంది.'

'ఇంక వెళదామా?'

'ఓ. కే. గుడ్‌నైట్.'

'గుడ్‌నైట్!'

షేక్‌హ్యాండ్సు తీసుకొని విడిపోయారు.

'ఏం పంతులుగారు ఏ ఊరు మనది?'

'ఈ జిల్లాలోదే ఒక పల్లెటూరు.'

'ఏం చేస్తుంటారు ఇక్కడ?'

'ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. ఇంకా ఏదీ దొరకలేదు.'

'యాడ మకాం?'

'అదుగో! ఆ మేడ మీద ఈ రోజే దిగాను.'

'హోహో!' ఆ వ్యక్తి వెకిలిగా నవ్వాడు.

